శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- మీ కోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మే 17, ప్రభాతవార్త** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జివోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి పదిలక్షలు



**సంగం మే 17 ప్రభాతవార్త** సంగం మండలం జంగాల కండ్రిక గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధి కి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 10 లక్షలు నిధులు మంజూరు చేశారు. హైస్కూల్ సమీపంలో ఉన్న ఆలయాభివృద్ధికి సహకరించిన మంత్రికి కాలనీ వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల అభ్యర్థనను మంత్రి దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరుకు కృషి చేసిన టిడిపి పార్లమెంట్ అధికారప్రతినిధి ముత్యాల విజయ్ చంద్ర సేవలను స్థానికులు అభినందించారు. త్వరంలో ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంకానుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నెల్లూరులో సామాన్యుడిలా మంత్రి నారాయణ

: మోదీ, బాబు బాటలో ప్రోటోకాల్‌కు స్వస్తి
: 52.5 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి నారాయణ
: గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది
: నెల్లూరును రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం
: మంత్రి నారాయణ





**నెల్లూరు, మే 17, ప్రభాతవార్త-వైద్యం :** ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బాటలో నడుస్తూ మంత్రి నారాయణ నెల్లూరులో కాన్వాయి, ప్రోటోకాల్ హంగులు లేకుండా సాదాసీదాగా ఒకే వాహనంలో పర్యటించి సామాన్యుడిలా ప్రజలతో మమేకమయ్యారు. అదివారం 3వ డివిజన్ సాదావారి పాలెంలో 24 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు.సాదావారిపాలెం లో వీధి వీధి తిరుగుతూ స్థానికులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆత్మకూరు బస్టాండు వద్ద 28.5 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దాతల సహకారంతో కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను వీఆర్‌సీ తరహాలో ఆధునీకరిస్తూ, పేద పిల్లలకు విద్యను ఆస్తిగా ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు.. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేసి దోమలు లేని నగరంగా మారుస్తామని, కాలువల ఆధునీకరణ ద్వారా నగరానికి ముంపు ముప్పు తప్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అవకతవకలకు పాల్పడి, అస్తవ్యస్త పాలనతో పరిశ్రమలను వెనక్కి పంపేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమనే నిజాన్ని గత పాలకులు విస్మరించారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఏకంగా 25 శాతం పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్‌కే తీసుకువచ్చారని వెల్లడించారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం నెల్లూరులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఈ నగరాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలుపుతామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి నారాయణ జేమ్స్ గార్డెన్ లో ఇటీవలే ప్రారంభించిన భాస్కర్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరికరాలను పరిశీలించారు.

◆ కమిషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రంగనాథ స్వామి ఆలయ చైర్మన్ లెక్కల వెంక రెడ్డి, 3వ డివిజన్ కోక్లస్టర్ శైలజ, ప్రెసిడెంట్ విజయమ్మ, వైస్ ప్రెసిడెంట్ గోవర్ధన్, యూనిట్ ఇన్‌చార్జ్ గొట్టిపాటి కృష్ణ, 45వ డివిజన్ ప్రెసిడెంట్ సుజన్, క్లస్టర్ ఇంచార్జ్ యశ్వంత్, కోక్లస్టర్ ఇంచార్జ్ డాక్టర్ పోకల రవి, నాయకులు జడ్. శ్రీనివాసులు రెడ్డి , మహేష్ స్థానిక టిడిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాసనమండలి సభ్యులు బీదను కలిసిన పెందుర్తి



**నెల్లూరు, మే 17, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర యాదవ్‌ను నెల్లూరు నగరం, మాగుంట లేఅవుట్‌లోని వారినివాస గృహం నందు సీఎం ఫ్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పెందుర్తికి పుష్పగుచ్ఛంతో బీద స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

## మోడేగుంటలో కార్డెన్ సెర్చ్

- 19 మోటార్ సైకిళ్లు, సీజ్



**కోవూరు, మే17 ప్రభాతవార్త :** కోవూరు మండలం మోడేగుంట గ్రామంలో ఆదివారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మోడేగుంట గ్రామంలోని ప్రతి ఇంటిని నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే దిశగా ఈ కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం వలన ఎక్కడైనా గంజాయి, ఇతర నిషేదిత పదార్థాలు ఉంటే వాటిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలు, అక్రమ ఆన్‌లైన్ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు ప్రజలు పూర్తిస్థాయిలో తమకు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఈ వేసవి సమయంలో చిన్నారులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వలన అనేక ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం పలు విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 19 మోటార్ సైకిళ్లు, శాలువాతో సత్కరించా సీజ్ చేశారు. వీటికి సరైన పత్రాలు ఉంటేనే సంబంధిత యాజమానాలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ముత్యాలరావు, ఖదిర్‌బాషా, ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ ఉన్నారు.



## మూతపడిన గ్రంథాలయాలకు మళ్లీ వెలుగులు

: జిల్లాలో ప్రతి లైబ్రరీని పునఃప్రారంభిస్తాం : మేకపాటి శాంతి కుమారి



**విడవలూరు, మే 17 ప్రభాతవార్త :** జిల్లాలో సిబ్బంది కొరతతో మూతపడిన ప్రతి గ్రంథాలయాన్ని దశల వారీగా తిరిగి పునః ప్రారంభిస్తామని నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ మేకపాటి శాంతి కుమారి తెలిపారు. ఆదివారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు, విడవలూరు, వావిళ్ల గ్రంథాలయాలను స్థానిక నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించి, గ్రంథాలయ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను సందర్శించే కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని గ్రంథాలయాలను పరిశీలించామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలు, గ్రంథాలయాల పరిస్థితి, సౌకర్యాలపై సమీక్ష నిర్వహించామని చెప్పారు.

◆ గ్రంథాలయాల అభివృద్ధిలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో సిబ్బంది కొరత కారణంగా పలు గ్రంథాలయాలు మూతపడినప్పటికీ, తప్పనిసరిగా ప్రతి గ్రంథాలయాన్ని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే దగుమాటి





**కావలి, మే 17 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, తుమ్మలపెంట గ్రామానికి ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మత్స్యకారసేవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రానుండడంతో సిఎం పర్యటన విజయవంతం కోసం జిల్లా కలెకటర్ హిమాన్షుశుక్లా, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుల వేగంగా కొనసాగుతున్నాయి. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ భద్రతా ఏర్పాట్లను ఎమ్మెల్యేతో పాటు సిఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం మొదటి నుంచి కట్టుబడి ఉందన్నారు. ఈసారి కూడా సిఎం పలు కీలక హామీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జువ్వలదిన్నె హార్బర్‌ను వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేక పోయిందని మత్స్యకారుల సబ్సిడీలు సంక్షేమ పథకాలు వేసిందన్నారు. కానీ సిఎం చంద్రబాబు హార్బర్ పనులు పూర్తి చేసి ప్రధాన మోడీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభింప చేశారన్నారు. మత్స్యకారుల్లో సిఎం రాకతో పండగ వాతావరణం నెలకొందన్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్లు, దండోరాలతో సందరి నెలకొంది. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నకిలీ జర్నలిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మంత్రి నారాయణను కోరిన నెల్లూరు వీడియో జర్నలిస్టులు..

: మంత్రి నారాయణకు వినతిపత్రం అందించిన వీడియో జర్నలిస్టులు
: నకిలీ జర్నలిస్టుల ఆటకట్టించండి.. మంత్రి నారాయణను కోరిన వీడియో జర్నలిస్టులు
: మీడియా ముసుగులో బెదిరింపులు.. మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లిన వీడియో జర్నలిస్టుల సంఘం



**నెల్లూరు, మే 17, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో మీడియా ముసుగులో సాగుతున్న అనధికార యూట్యూబ్ ఛానళ్ల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వీడియో జర్నలిస్టులు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందజేశారు; పత్రికా రంగానికి ఎలాంటి సంబంధం లేకుండా, సోషల్ మీడియా పేరుతో సాధారణ పౌరులు, వ్యాపారులు, ప్రభుత్వ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తూ, ఇవ్వని పక్షంలో పరువు తీస్తామని బెదిరిస్తున్న నకిలీ జర్నలిస్టులపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఈ అక్రమ వసూళ్ల వల్ల సమాజంలో నిజాయితీగా పనిచేసే జర్నలిస్టుల ప్రతిష్ట దెబ్బతింటోందని వారు మంత్రి దృష్టికి తీసుకురాగా, దీనిపై స్పందించిన మంత్రి నారాయణ తక్షణమే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అసంపూర్తిలో గ్రామ సచివాలయం

- ఎప్పటికి పూర్తయ్యేనో.. గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు
- చోద్యం చూస్తున్న అధికారులు - జిల్లా కలెక్టర్ గారూ.. మీరైనా పట్టించుకోండి



**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ప్రజలకు వారి ముంగిటికే వివిధ రకాల సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. కోవూరు మండలంలో మొత్తం 10 పంచాయతీలకు గానూ 16 సచివాలయాల భవనాలకు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. మొత్తం మండలంలో 16 సచివాలయాలకు మంజూరైన కేవలం పడుగుపాడు, ఇనమడుగు, గుమ్మలదిబ్బ సచివాలయాల భవనాలు మాత్రం పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో అసంపూర్తిగా కొట్టుమిట్టాడుతున్నాయి. కోవూరులోని శాంతినగర్ 6వ వీధిలో 2019 డిసెంబర్ 24వ తేదిన అప్పటి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి 40 లక్షల వ్యయంతో ఈ సచివాలయాలకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు పొందిన కాంట్రాక్టర్లు మాత్రం కోవూరు పంచాయతీ పరిధిలోని 2 ప్రాంతాల్లో మాత్రం సగం నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. అసలు సచివాలయ నిర్మాణం జరుగుతుందా లేదా అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నం అవుతున్నాయి. గత ప్రభుత్వం ఏదో ఉద్దేశంతో వీటిని ప్రారంభించినా పనులు పొందిన కాంట్రాక్టర్ మాత్రం వీటిని అసంపూర్తిగా వదలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**మందుబాబులకు నిలయం** కోవూరు పంచాయతీ పరిధిలో శాంతినగర్ 6వ వీధి , నిర్మాణంలో ఉన్న ఈ గ్రామ సచివాలయ అసంపూర్తి భవనాలు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలు చేసే వారికి నిలయాలుగా మారిపోయాయి. గత 3 సంవత్సరాలుగా ఈ భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో అవి ఎన్నేళ్లకు పూర్తవుతాయో అని గ్రామస్తులు వాపోతున్నారు. 6వ వీధిలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయంలో సిమెంట్ బస్తాలు గడ్డ కట్టి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు చొరవ తీసుకుని ఈ భవన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ఎమ్మెల్యేను ప్రశంసించిన జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల

అన్నిశాఖల సమన్వయంతో పనిచేయాలి జిల్లా కలెక్టర్



**కావలి, మే 17 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, తుమ్మలపెంటలో ఈనెల 19న సిఎం పర్యటన ఏర్పాట్లను ఆదివారం జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, సిఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడిలతో కలసి సభా ప్రాంగణ ఏర్పాట్లు పరిశీలించారు. సభా ప్రాంగణ ఏర్పాట్లన్నీ వేగవంతంగా సాగుతుండడంతో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారడ్డిని కలెక్టర్ ప్రశంసించారు. సభా ప్రాంగణంలోని హెలిప్యాడ్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, భద్రతా చర్యలు ప్రజల రాకపోకల ఏర్పట్లపై జిల్లా కలెక్టర్ అదికారులకు పలు సూచనలు చేశారు. ఈ సభకు భారీగా ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మత్స్యకార గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలిపారు. సభ విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను ఆహ్వానిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సభను విజయవంతం చేయడానికి ప్రతి అధికారి కష్టపడి పనిచేస్తున్నారని ఇలాగే సభకు మత్స్యకారులు పెద్ద ఎత్తున రావడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకార కుటుంబాలకు రూ.20వేలు భృతి విడుదల కావడం ఆనందకరం అన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో తుమ్మలపెంటతో పాటు పరిసర గ్రామాల్లోని మత్స్యకారుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొందన్నారు. గ్రామాల్లో స్వాగత ఏర్పాట్లు, దండోరాలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు.

## వైభవంగా కామాక్షితాయి ధ్వజ అవరోహణం



**బుచ్చి మే 17 ప్రబాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజఅవరోహణం కార్యక్రమం జరిగింది. బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన సందర్భంగా ధ్వజఅవరోహణం కార్యక్రమం నిర్వహించారు. ధ్వజారోహణం రోజు కొడిముద్ద తిన్న భక్తులు తిరిగి ధ్వజఅవరోహణం రోజు కూడా కొడిముద్ద తింటే పరిపూర్ణమైన ఫలితం ఉంటుందని పెద్ద ఎత్తున కొడిముద్ద తినేందుకు తరలివచ్చారు. అర్చకులు వారికి కొడిముద్దను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కొండా మల్లికార్జునరెడ్డి న్యాయవాది వ్యవహారించారు. అలకలతోపు కార్యక్రమానికి శ్రీశైలం కృష్ణమూర్తిశర్మబ-హైమావతి వ్యవహారించారు.

**వైభవంగా అశ్వవాహనం ఉత్సవం** శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారు భక్తులకు అశ్వవాహనంపైన భక్తులు దర్శనమిచ్చారు. భక్తులు పరవశించి నైవేద్యాలు అందజేశారు. తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. చిక్కుడు వెంకటకామేశ్వర ప్రసాద్ ఉభయకర్తగా వ్యవహారించారు.

**ఏకాంతసేవలో శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి** శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారికి స్వామి వారికి ఏకాంతసేవ ఉత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఏకాంతసేవలో స్వామి వారిని అమ్మవారిని దర్శించుకొని భక్తులు పరవశించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కీర్దిశేషులు దుద్దుకూల పురుషోత్తం స్పెసిఫిక్ ఎండోమెంట్, వారు వ్యవహారించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పుష్పాలంకరణ ఉభయకర్తలుగా దర్శిసుబ్బారావు వింజమూరు వారు వ్యవహారించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు బోర్డు మెంబర్లు నక్కల శివకృష్ణ,, తిరువాయిపాటి నందకుమార్, పెన్నత్తూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మి. పాలూరు చాముండేశ్వరీ, కీలుకుప్ప శ్రీనివాసులు , సూరాయపాళెం ప్రత్యూషా, ముంగ సుధాకర్, రామయాణం సుధారాణి, కొల్లపూడి శారద, వివిఎస్ జి.గంగాప్రసాద్ ఎక్స్ అపీషియా సభ్యులు పర్యవేక్షించారు.



## ఎంఎస్‌గౌడ్‌ను సత్కరించిన గౌడ సంఘం నేతలు



**కావలి, మే 17 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన డివిజన్ గౌడ సంక్షేమ సంఘం ఆత్మీయ కార్యక్రమంలో కావలి డివిజన్ గౌడ సంక్షేమ సంఘం యువత అధ్యక్షులుగా మోర్ల సురేష్‌గౌడ్ (ఎంఎస్‌గౌడ్)ని ఎన్నుకొన్న సందర్భంగా జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరకాల సీనయ్యగౌడ్ జిల్లా గౌడ సంఘం సభ్యులు కావలి డివిజన్ గౌడ సంక్షేమ సంఘం సభ్యులు శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## చెదలు పట్టిన శ్రీ శిశు సంక్షేమ భవనం

**మనుబోలు మే 17 ప్రభాతవార్త :** లక్షలాది రూపాయాలు ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలు చెలు పట్టినా పాలకులు,అధికారులు పట్టించుకోక పోవడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. మనుబోలు మండల కేంద్రంలోని శ్రీశిశు సంక్షేమ రిసోర్స్ భవనం ఈ భవనాన్ని 2016 వ సంవత్సరంలో సుమారు తొమ్మిది లక్షల రూపాయలతో నిధులతో నిర్మించారు. భవనం నిర్మించి పది సంవత్సరాలు పూర్తి కాకముందే తలుపులకు చెదలు పట్టి శిధిలావస్తుకు చేరుకోవడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. అసలు ఈ కార్యాలయానికి తలుపులు తీసి ఎంత కాలం అయిందో అని పలు వురు చర్చించు కుంటున్నారు. ఈ భవనం ఏదో మారుమూల ప్రాంతంలో ఉంటే ఏమోగాని మండల కేంద్రంలో తహసి ల్దారు కార్యాలయం,ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో ఉన్నప్పటికి ఏ అధికారి పట్టించుకునే పరిస్థిలేదు. ఇకనైనా సంబందిత అధికారులు స్పందించి పాడు బడేందుకు సిద్ధంగా ఉన్న చెదలును దులిపి మరమ్మత్తులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## మండే ఎండల్లో మూగజీవాలకు అండగా మర్రిపాడు యువకులు





**మర్రిపాడు, మే17, ప్రభాతవార్త:** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో మూగజీవాలు దాహార్తితో అలమటిస్తున్న వేళ మర్రిపాడు మండలానికి చెందిన కొందరు యువకులు మానవత్వాన్ని చాటుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మండల కేంద్రమైన మర్రిపాడు గ్రామానికి చెందిన కన్నెమరకల రమణయ్య, కన్నెమరకల పెద్ది నర్సింహులు, కన్నెమరకల రత్తయ్య, కన్నెమరకల శ్రీనివాసులు, తోడేటి నరేష్, కన్నెమరకల ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మర్రిపాడు నుంచి చుంచులూరు, రాజుపాళెం సరిహద్దు హైవే ప్రాంతాల వరకు ఉన్న పలు నీటి తొట్టెల్లో నీటిని నింపుతూ పశువుల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్నారు.అడవి ప్రాంతాలకు సమీపంలో తిరుగుతున్న కోతులకు అరటిపండ్లు, ఆహార పదార్థాలను అందిస్తూ మూగజీవాల పట్ల తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రస్తుతం 40డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో పశువులు, కోతులు నీరు ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులుపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన యువకులు ఎండాకాలం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటికే ఆరు విడతలుగా నీరు, ఆహారంఅందించారు. మూగజీవాల పట్ల యువకులు చూపుతున్న ప్రేమ సేవాభావాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఈకార్యక్రమంలో గ్రామానికి చెందిన కర్నాటి సుబ్బారెడ్డి కూడా ఈకార్యక్రమాలకు చలించి తనవంతు సహాయం అందించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని నీరు, ఆహారం పంపిణీలో సహకరించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతుగా మూగజీవాలకు నీరు, ఆహారం అందించేలా ముందుకు రావాలని సేవా కార్యక్రమ నిర్వాహకులు కోరారు.

## భద్రత మరియు రక్షణపై అవగాహన



**బిట్రగుంట మే 17 ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆదివారం ఒకటో నెంబర్ ప్లాట్ ఫామ్ పై ప్రయాణికుల భద్రత, సంరక్షణపై విజయవాడ రైల్వే డివిజన్ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు, వివిధ శాఖల సిబ్బందికి అవగాహన ప్రదర్శన రూపంలో కలిగించారు. ముఖ్యంగా విపత్తుల సంభవించినప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, ప్రయాణికు లను ఏ విధంగా సంరక్షించాలనే విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నుంచి ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డులా తహసీల్దార్ కార్యాలయం



**ఉదయగిరి, మే 17, ప్రభాతవార్త :** ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఒక వైపు అధికారులు స్వచ్ఛహి సేవ కార్యక్ర మాల విలువగా నిర్వహిస్తూ ర్యాలీలు చేస్తూ ప్రతిజ్ఞలు జరుపుకుంటూ ఉంటే ఆదర్శంగా ఉండా ల్సిన ప్రభు త్వ కార్యాలయాలు ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా వ్యవహారిస్తున్నారు. ఇందులో తహసీల్దార్ కార్యాలయం చెత్త నిలువలో ప్రధమ స్థానంలో ఉంది అని చెప్పటంలో అతిశయోక్తి లేదని స్థానికులు అంటున్నారు. కార్యాలయం ముందు గేటు పక్కన ఒక డంపింగ్ యార్డులో ఉండాల్సిన చెత్త నిల్వ ఉండడం విమర్శలకు దారితీస్తుంది. అధికారులు వెంటనే స్పందించి చెత్తను శుభ్రపరిచేందుకుదైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రతిభ చూపిన ప్రభుత్వ స్కూల్స్ పదోతరగతి విద్యార్థులకు అభినందన సభ



**బుచ్చి మే 17 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థుల కృషి,పట్టుదల అభినందనీయమని ఆంధ్రప్రదేస్ ఉపాధ్యాయ సంఘం ( అపస్ ) జిల్లా అద్యక్షులు కె.రాజగోపాలచారి,మండల విద్యాశాఖాధికారి పి.వి రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వ పది విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అపస్ ఆద్వర్యంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమిష్టి కృషి కారణమన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావంతో భవిష్యత్తులో కూడా ఇదే ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు గురువులు, పెద్దల పట్ల విద్యార్థి దశ నుండే గౌరవభావాన్ని అలవర్చుకొని స్వామి వివేకానంద,అబ్దుల్ కలాం మహనీయులు చూపిన బాటలో విద్యార్థులంతా పయనించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతులు, కానుకలు జ్ఞాపికలు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం. సుజాత,ఓ వెంకటేశ్వరరావు, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్,అపస్ రాష్ట్ర సహాధ్య క్షులు ఎం.చక్రపాణి, జిల్లా మహిళా కన్వీనర్, ఏ రాజమ్మ, గౌరవాధ్యక్షులు ఎం.రవి,అధ్యక్షులు పి.సురేంద్ర, ప్రధాన కార్యదర్శి పి.మల్లికార్జున,ఆపస్‌నాయకులు, వి.రవి, ఎస్.శశిదర్. వి.రాజశేఖర్, జె రమేష్, కె మాల్యాద్రి, కే రమేష్, పి.వెంగయ్య, పి.రవి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం తొలగింపు

**ఉదయగిరి, మే 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో దేవతా స్థలం ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని సదరు స్థలం హక్కు దారులు శుక్రవారం తొలగించారు. సదరు ఆక్రమించిన స్థలంపై సదరు స్థల అనుభవదారులు దాయాదులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్వయానా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికి స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిర్మాణాలు చేపట్టకూడదు అని చెప్పినప్పటికీ కలెక్టర్ ఆదేశాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలను ధిక్కరించి సదరు స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆ నిర్మాణాన్ని హక్కుదారులు తొలగించడం విశేషంగా మారింది. అంతే కాకుండా ఆక్రమణదారులు వారి ఇంటికి సంబందించిన విద్యుత్ మీటరును వేప చెట్టుకు తగిలించి ఉండడంపై గ్రామస్తులు అభ్యంతరం తెలుపగా ఆ గ్రామ విద్యుత్ లైన్‌మెన్ వెంటనే స్పందించి విద్యుత్ మీటర్ తొలగించి ఆక్రమణదారుల ఇంటికే తగిలించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్థలాల కబ్జా ప్రారంభం కావడం పట్ల ప్రాంతంలో ప్రజలు అభద్రతకు లోనవుతున్నారని ఇలాంటి ఆక్రమణలపై అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహారించి ప్రజలకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ ఆక్రమణ ఉదాంతంపై కలెక్టర్ ఆదేశాలు దిక్కరిస్తున్నప్పటికీ మండల తహసీల్దార్ ఉదాసీనంగా వ్యవహారించడం పట్ల పలు విమర్శలు ఉత్పన్నమవుతున్నాయి.



## అంకాళ పరమేశ్వరీ దేవి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు

**రాపూరు, మే 17, ప్రభాతవార్త :** మహిమాన్వితమైన దేవతగా, భక్తితో కోరిన వారికి కోరిన వరాలు ఇచ్చే తల్లిగా భక్తులు భావించే వేపినాపి గ్రామ దేవత శ్రీ పోతుకోండ అంకాళ పరమేశ్వరీ దేవి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు.ఉదయం నుండే పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకోని అమ్మవారికి పోంగళ్ళు పెట్టుకోని మొక్కులు చెల్లించుకోని, అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహిం చారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ అర్చక స్వాములు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆంద జేశారు.



## పెట్రోల్ ధరలు పెంపుదలపై నిరసన ర్యాలీ

**వింజమూరు, మే 17, ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారంఉదయగిరిలో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రేవునూరు శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఉదయగిరిలోని ట్యాంకు బండ్ వద్ద నుండి తహసీల్దార్ ఆఫీసు వరకు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన ర్యాలీ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఈ ప్రభుత్వం పెంచడం ఆందోళనకరమైన విషయం అన్నారు. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించి దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోల్,డీజిల్ విక్రయించడం జరుగుతుందన్నారు. ఇప్పుపు తగ్గించడం బదులు మరింతగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై భారీ భారం మోపడమేనన్నారు. రైతాంగం, రవాణా రంగంపై ఈ ధరల ప్రభావం పడుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.



## కంటి క్యాన్సర్‌ను గుర్తించకపోతే ప్రమాదంగా మారే అవకాశముంది

- డాక్టర్ బీరం రాజేందర్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు



**నెల్లూరు, మే 17, ప్రభాతవార్త-వైద్యం :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నెల్లూరు సిటీ, డివిజన్ సభ్యులకు స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ అండ్ లేజర్ సెంటర్ వారి సౌజన్య ంతో ఆదివారం టౌన్ హాల్లోని మినీ హాల్‌లో క్యాన్సర్ సంబంధిత కంటి వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సును ప్రారంభించిన అనంతరం డాక్టర్ బీరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కంటి క్యాన్సర్ అనేది కంటిలోని భాగాలు లేదా కనురెప్పలు, కన్నీటి గ్రంధులు వంటి చుట్టు పక్కల నిర్మాణాలలో కణాలు నియంత్రితంగా పెరగడం వల్ల వచ్చే అరుదైన వ్యాధి అని, ఇది కంటి చూపును దెబ్బతీయడమే కాకుండా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందన్నారు. సాధారణంగా కంటి క్యాన్సర్ రకాలలో మెలనోమా, ఇది పెద్దల్లో సర్వసాధారణంగా కనిపించే కంటి క్యాన్సర్, రెటినోబ్లాస్టోమా. ఇది చిన్న పిల్లల్లో(ముఖ్యంగా ఐదు సంవత్సరాల లోపు) వచ్చే కంటి క్యాన్సర్, ఐలిడ్ కార్సినోమా. ఇది కను రెప్పలపై చర్మ క్యాన్సర్ సోకడం, ఇంట్రాక్యులర్ లింఫోమా. ఇది కంటిలోని తెల్ల రక్తకణాలలో ప్రారంభమయ్యే అరుదైన క్యాన్సర్, మెటాస్టాటిక్ కంటి కణితులు, ఇది రొమ్ము, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్న వారిలో క్యాన్సర్ కణాలు కంటికి వ్యాపించడం ద్వారా కంటిలో కణితులు ఏర్పడతాయి. సాధారణ లక్షణాలు : కంటి క్యాన్సర్ ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవచ్చు అయితే కణితి పెరిగే కొద్ది ఈ లక్షణాలను గమనించవచ్చు. దృష్టి మసకబారడం లేదా అకస్మాత్తుగా చూపు కోల్పోవడం, కంటిలో నల్లటి లేదా గోధుమ రంగు మచ్చలు పెరగడం, కంటి ముందు చిన్న చిన్న చుక్కలు గీతలు తేలుతున్నట్లుగా అనిపించడం, కంటి చూపు పరిధి తగ్గిపోవడం, కంటి ఆకారం లేదా కనుగుడ్డు స్థానంలో మార్పులు రావడం, మినుకు, మినుకు మనే కాంతి లేదా నీడలు పడినట్లు అనిపించడం మొదలగునవి అని అన్నారు. కంటి క్యాన్సర్ నిర్ధారణకు కంటి పరీక్షలు, అల్ట్రాసౌండ్, ఎమ్మారై వంటి ఇమేజింగ్ పరీక్షలు అవసరమవుతాయని తెలిపారు. క్యాన్సర్ దశను బట్టి శస్త్ర చికిత్స, రేడియో థెరఫీ, లేజర్ థెరపీ లేక కీమో థెరపీ ద్వారా చికిత్స అందిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా గౌరవ అధ్యక్షులు అనుముల జయప్రకాష్, యుపీహెచ్‌సీ కోఆర్డినేటర్ కే.వెంకటేశ్వర్లు, పీహెచ్‌పీ జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు, నంద్యాల మాలిని, డి.సుధాకర్, ఎన్.రమణయ్య, ఎన్.మోహన్‌రావు, నెల్లూరు సిటీ, డివిజన్‌లోని సభ్యులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ పనుల పేరిట రైతులను అడ్డుపెట్టుకుని టిడిపి నాయకులు భారీ దోపిడి

**ముత్తుకూరు, మే 17, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో ఇరిగేషన్ (సాగునీటి) పనుల పేరిట రైతులను అడ్డుపెట్టుకుని తెలుగుదేశం పార్టీ నేతలు భారీ దోపిడీకి పాల్పడుతున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జంగాల కండ్రిగ జంక్షన్ వద్ద ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల రైతాంగానికి సాగనీరు అందించే పలు కాలవలను స్వయంగా రైతులు, స్థానిక ప్రజలతో కలిసి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఎలాంటి ఇరిగేషన్ పనులు చేయకుండానే, సోమిరెడ్డి, అడ్డగోలుగా కోట్ల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. ఇరిగేషన్‌లో అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలను, ఫోటోలతో సహా మొన్ననే నెల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మీడియా ముందు ఉంచామన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు జంగాల కండ్రిగ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, సాగునీటి కాలువల దుస్థితిని రైతులు, స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించామన్నారు. సోమిరెడ్డి కాలువల పనులలో ఏ విధంగా చేతివాటం ప్రదర్శిస్తున్నాడో రైతులే కథలు, కథలుగా చెబుతున్నారన్నారు. రోడ్డున పోయే వాళ్లకు ఇరువైపులా కనిపించినంత దూరం మాత్రమే కాలువలను శుభ్రం చేస్తూ మిగిలిన వాటిని వదిలేస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గత ఏడాది కనీసం రోడ్డుకు కనిపించే ప్రాంతంలోనైనా కొద్దిపాటి పనులు చేసేవారు, ఈ ఏడాది అసలు పనులే చేయకుండా, ఇష్టానుసారంగా బిల్లులు డ్రా చేసుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఇరిగేషన్ పనుల పేరిట సోమిరెడ్డి చేస్తున్న అవినీతిలో ఇన్ని రకాల చిట్కాలు ఉంటాయా అని రైతులు చెబుతుంటే ఆశ్చర్యం వేసిందన్నారు. సోమిరెడ్డి చేస్తున్న అక్రమాలను మీడియా ద్వారా ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ పర్యటన చేపట్టామన్నారు. నెల్లూరు జిల్లాలో గతంలో వచ్చిన మొంతా తుఫాను (నవంబర్ 2025) నష్ట నివారణ చర్యల్లో భాగంగా, దాదాపు ఎనిమిది నెలల క్రితం జిల్లా కలెక్టర్ ఆమోదించిన పనులు చేయకుండానే ఇప్పుడు దొంగ బిల్లులు చేసుకుంటున్నారన్నారు. ఇరిగేషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలనే నిబంధనను పక్కనబెట్టి, నీళ్లు వదిలిన తర్వాత సోమిరెడ్డి అగ్రిమెంట్లు చేసుకోవడానికి పథకం వేశాడన్నారు. సాగునీటి కాలువలకు నీళ్లు వదిలిన తర్వాత అగ్రిమెంట్లు చేయాలంటూ సోమిరెడ్డి ఒత్తిడి తెచ్చాడని, నీళ్లు ఉన్నప్పుడు అగ్రిమెంట్లు చేయడం కుదరదని (ఇంచార్జ్ ఈఈ) నిరాకరించాడని బాధ్యతల నుంచి తప్పించాడన్నారు. సోమిరెడ్డి అడుగులకు మడుగులు వత్తేవాడు, అనుకూలంగా తల ఊపేలా ఉండే కొత్త ఈఈని సెంట్రల్ డివిజన్‌లో నియమించుకుని, ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా అగ్రిమెంట్లు చేసుకుంటూ దొంగ బిల్లులు సృష్టిస్తున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఏడు నెలల క్రితం చేయవలసిన పనులకు, అగ్రిమెంట్ చేసి బిల్లులు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. తాము సేకరించిన అధికారిక వివరాల (ప్యాటర్న్) ప్రకారం ఒకే పనిని దాదాపు మూడు, నాలుగు రకాలుగా చూపిస్తూ బిల్లులు డ్రా చేస్తున్నారన్నారు. పని జరిగే ప్రాంతం (డ్రైనేజ్) ఒక్కటే అయినప్పటికీ, కేవలం పేర్లు (నామినెక్లేచర్) మార్చి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కనుపూరు కాలువకు సంబంధించి మనుషులతో చేయించాలని కిలోమీటర్ పనులకు రూ. 10 లక్షల చొప్పున అంచనా వేసి, ఒక డోజర్ (జెసిబి)ని తెచ్చి కాలువకు ఇరువైపులా మట్టిని నెట్టేసి, పూడికతీత పనులు పూర్తయినట్లు దొంగ బిల్లులు సృష్టించి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్నారు. ప్రతీ సీజన్‌లో మేమే సొంతంగా డబ్బులు వేసుకుని ఈ కాలువ పూడికతీత పనులు చేసుకుంటున్నాం తప్ప, ప్రభుత్వం కానీ ఇక్కడి కాంట్రాక్టర్లు కానీ రూపాయి పని చేయలేదని రైతులు నా సమక్షంలోనే చెప్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, ఎంపిపి గండవరం సుగుణ, ఈపూరు కోటారెడ్డి, బందెల వెంకట సుబ్బయ్య, కోటేశ్వరరావు, రాజకుమారి, జంగాలకండ్రిగ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## 45వ డివిజన్‌లో భాస్కర్ ఆర్థో హాస్పిటల్‌ను సందర్శించిన మంత్రి నారాయణ

**త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఖసంజీవినిఖ అమలు.. మంత్రి నారాయణ**
**ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత**
**అపెక్స్ ఆర్థో హాస్పిటల్ సేవలు అభినందనీయం.. మంత్రి నారాయణ**
**ప్రజల ఆరోగ్యం బాగుంటేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది**



**నెల్లూరు, మే 17, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని 45వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భాస్కర్ ఆర్థో హాస్పిటల్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సందర్శించి, వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, అందుకే గౌరవ ముఖ్యమంత్రి ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

సీఎం ఆలోచనల మేరకు కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన సంజీవని కార్యక్రమాన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయబోతున్నామని మంత్రి ప్రకటించారు. డాక్టర్ భాస్కర్ రావు ఆధ్వర్యంలో సరికొత్త టెక్నాలజీతో,

50 పడకలతో ఈ స్పెషలైజ్డ్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే 20 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి కల్పించడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అపెక్స్ ఆర్థో హాస్పిటల్ మరింత విస్తరించి, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.

## ఉచిత ఖత్నా కార్యక్రమం



**గూడూరు, మే 17, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని షాది మంజిల్ నందు మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో వంద మంది ముస్లిం పిల్లల కు ప్రముఖ డాక్టర్ మహబూబ్ భాషాచే ఉచిత ఖత్నా (ఒడుగులు) చేయిం చారు. ఈ సందర్భంగా నెట్వర్క్ గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత 17 సంవత్సరం నుండి పేద ముస్లిం పిల్లలకు ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ ముస్లిం ప్రముఖులు సంఘటితమై ముస్లిం పేద పిల్లల ఉన్నత విద్యకై కృషి చేయాలని కోరారు. ఉచితంగా మందులను లలిత మెడికల్స్ యూసఫ్ హుస్సేన్ అందచేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహీం, అల్లి హుస్సేన్, మహబూబ్ భాషా, రావుఫ్, రఫీ నజీర్, గౌస్, అహ్మద్ భాషా, నాజర్, షానవాజ్, తదితరులు పాల్గొన్నారు.

## జెవివి సేవలు అభినందనీయం



**గూడూరు, మే 17, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాకాటి రామమోహన్ దాతృత్వంలో దివ్యాంగులకు ముఖ్య అతిథిగా హాజ రైనా ఎంఈఓ కాంచన చేతుల మీదుగా దివ్యాం గుల కు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేవివి వారు సమాజంలో ఉన్న మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయటమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని విద్యార్థులను కూడా ఎంతో ప్రోత్సహిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు మంచి జ్ఞాపికలు, బహుమతులు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వారు చేయటం చాలా సంతోషంగా ఉందని నేను కూడా ఒక మంచి కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, రామమోహన్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమ రావు, ఆనంద్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, నక్కా గోపి, పసుపులేటి ప్రసాద్, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్ ధరల పెంపుపై నిరసన నేడే



**అనంతసాగరం,మే17,ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా ధరలను పెంచుతూ పేద ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుకు నిరసనగా వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆత్మకూరులో నిర్వహిస్తున్నామని అనంతసాగరం మండల వైసిపి కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉసోమవారం ఉదయం 10గంటలకు ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రాన్ని అందజేస్తామని ఆయన తెలిపారు. మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిచ్చిరెడ్డి కోరారు.

## ఇళ్లకు తాళాలు.. గణనకు అడ్డంకులు

**కోట,మే 17 ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా 15 ఏళ్ల తరావ్త జనగణన నిర్వహిస్తుండగా.. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వూసి ఉండగా, మరి కొన్ని కోట్ల ఎవరూ అందుబాటలో ఉండటం లేదు. దీంతో సర్వేలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో మే 1 న ప్రారంభమైన తొలిదశ గృహ గణన నెమ్మదిగా సాగుతోంది. గణన కోసం గ్రామాలకు వెళ్లే ఎన్యుమరేటర్లు,సూపర్ వైజర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నంబర్లు సక్రమంగా లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయి.ఇంటి నుంచి 34 అంశాలతో కూడిన వివరాలు సేకరించాలి. దీనికి ఎక్కువ సమయం పడుతోంది. కొందరు ఉపాధి నిమిత్తం,ఉద్యోగ రిత్యా ఇళ్ల వద్ద ఉండటం లేదు. అలాంటి ఇళ్లకు ఒకటికి రెండు సార్లు వెళ్లాల్సి వస్తోంది.

## నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం



**నెల్లూరు, మే17, ప్రభాతవార్త వైద్యం :** నెల్లూరు విద్యుత్ భవన్‌లో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు 0861-232047 నెంటర్‌లో నిర్వహించబడుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం తెలిపారు. అలాగే, ఏపీఎస్పీ డీసీఎల్ సీఎండీ ప్రతి సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12.30గంటల వరకు 8977716661 నెంబర్‌లో నిర్వహి స్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రాఘవేంద్రం కోరారు.

## ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, మే17 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి ప్రత్యేక తరగతులను ఆదివారం డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర నాయక్ నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ పరిధిలో కొన్ని మండలాల్లో 1095 మంది విద్యార్థులు ఈ నెల 20వ తేది నుంచి 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నారన్నారు. ఆయా మండలాల్లో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో సంబంధిత సబ్జెక్టు టీచర్లు ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారన్నారు. విద్యార్థులు కూడా ఈ ప్రత్యేక తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని నూరుశాతం ఫలితాలు సాధించాలని ఈసందర్భంగా ఆయనపేర్కొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్‌లో ఆయన పలు విషయాలను నిశిత పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి ఉన్నారు.

## నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపును నిరసిస్తూ ర్యాలీ



**ఉదయగిరి, మే 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణ కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నాయకులు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయగిరిలోని ట్యాంక్ బంక్ (పెట్రోల్ బంకు) వద్ద నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంపును నిరసిస్తూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తారు అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఆందోళనకర విషయం ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి, దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోల్, డీజిల్ విక్రయించడం జరుగుతుందన్నారు. ఇప్పుడు తగ్గించడం బదులు మరింతగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై భారీ భారం మోపడంతో పాటు, రైతాంగం , రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. కావున ఉదయగిరి నియోజకవర్గంలోని అందరూ మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీటీసీలు, ఎక్స్ సర్పంచ్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నాము.

## ఎన్‌సీసీ క్యాడెట్లు కు అభినందనలు



**కోట,మే 17 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువు కునేటప్పుడు ఎక్కువ మంది నేషనల క్యాడెట్ కోర్సు ( ఎన్‌సిసి)లో చేరటానికి ఆసక్తి చూపిస్తారు.అదనపు అర్హతగా ఉపయెగప డు తంది.రక్షణ రంగాల్లో చేరేందుకు అవకాశం ఉంటందునే ఉదేశ్యంతో వార్షిక శిక్షణ ఉంటు ంది. నెల్లూరునారాణయ హైస్కూల్‌లో గత 10 రోజులగా ఎన్‌సిసి క్యాంప్ నిర్వహిం చా రు. ఈ క్యాంప్‌కు ఎన్‌బికేఆర్ ఎన్‌సిసి వి ద్యార్థులు హాజర య్యారు. ఆమేరకు వివిధ అంశాల్లో విజేతలగా నిలిచిన వారికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం.శ్రీనివాసులు ప్రశంసా పత్రాలను అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కళాశాలల నుంచి శిక్షణకు వేళ్లిన విద్యార్థులు ఒక చోట చేరటం వల్ల స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతోం దన్నారు. సమస్యలెదురైనా సర్దుకుపో వడం,సవాళ్లను అధిగమించడం, లాంటి విషయాలపై అవగాహన పెరుగుతు ందన్నారు. నాయకత్వ లక్షణాలు అలవడుతాయని పేర్కొన్నారు. అక్కడ జరిగిన క్యాంప్‌లో శ్రావణ, వేంకటేష్‌లకు బెస్ట్ ఎన్టీ కేడెట్ పురస్కారం లభించింది.ఆమేరకు వారిని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అభినంది ంచారు.ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్, మల్లిఖార్జున్‌రెడ్డి, పాల్గొన్నారు.

## సందడి చేసుకున్న 2015 పదవ తరగతి విద్యార్థులు



**కోవూరు, మే17 ప్రభాతవార్త :** తాము చదివిన పాఠశాలలో ఏయే తరగతుల్లో తాము విద్యాభ్యాసం చేశామో ఆ తరగతి గదులకు వెళ్లి తాము చదివిన పాఠాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఒకరికొకరు ప్రశ్నించుకుంటూ



2015వ సంవత్సరానికి సంబంధించిన విద్యార్థినులు ఆదివారం కోవూరులోని పీఆర్ఎన్ బాలికోన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ పాఠశాలలో ఉన్న బీసీ బాలికల వసతి గృహంలో అప్పట్లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థినులంతా ఆదివారం సమావేశమై గత స్మృతులను నెమరువేసుకున్నారు. గతంలో తాము ఏయే ఉపాధ్యాయుల దగ్గర పాఠ్యాంశాలు నేర్చుకున్నాము అనే విషయాలను ఆరా తీసుకున్నారు. ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకోవడమే కాకుండా పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుల అనుమతితో వారు తెచ్చుకున్న భోజనాలను అక్కడే తిని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా 2015 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని శిరీష మాట్లాడుతూ 2015 సంవత్సరంలో తామంతా పదవ తరగతి ఇక్కడ చదివి ఉత్తీర్ణులయ్యామని, అప్పట్లో ఉపాధ్యాయులు తమ పట్ల ప్రత్యేక అభిమానాన్ని చూపుతూ తాము ఉత్తీర్ణులు అయ్యేందుకు సహకరించారన్నారు. వసతి గృహ సంక్షేమాధికారి సౌభాగ్యవతి కూడా తమను కన్న బిడ్డల్లాగా చూసుకుని తాము పదవ తరగతి పాస్ అయ్యేందుకు సహకరించారన్నారు. ఇందుకు సంక్షేమాధికారిణికి ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, గిరిజ, తిరుపతమ్మ, జగదీశ్వరి, శ్రావణి, భవాని, సుబ్బలక్ష్మి, వాణి, ప్రవల్లిక, సుమలతలు ఉన్నారు.

## ప్రతిభకు పేదరికం అడ్డుకారాదు



**కోవూరు, మే17 ప్రభాతవార్త :** ఇటీవల విడుదల అయిన పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని నిరూపించిన విద్యార్థిని సాయి అపర్ణను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రైతు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ,



తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఆయన తన సొంత నిధులతో పారితోషకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలదిబ్బ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో తొలి ప్రయత్నంలోనే జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఈ గ్రామానికి ఒక్కసారిగా మంచి పేరు తెచ్చిందన్నారు. ఇటువంటి విద్యార్థులను తాను ఉచిత రీతిన ఆదుకో వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అనంతరం 594 మార్కులు సాధించిన సాయి అపర్ణ, 587 మార్కు లు సాధించిన జి. శివకృష్ణ, 567 మార్కులు సాధించిన భార్గవిలను ప్రభాకర్‌రెడ్డి తన సొంత నిధుల నుంచి ముగ్గురికి పారితోషకం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలించిన గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్



**కొడవలూరు, మే 17 ప్రభాతవార్త:** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా గ్రంథాల య సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతి కుమారి ఆదివారం కొడవలూరు శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన విద్యార్థులతో మాట్లాడి, సమ్మర్ క్యాంప్‌లో నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించే విధంగా శిబిరాలు నిర్వహిం చడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం గ్రామ నాయకులతో సమావేశమై గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం చైర్‌పర్సన్‌కు నాయకులు, లైబ్రేరియన్ కలిసి సాలువాలతో సత్కరించి పూల మొక్కను బహూకరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె. రాజేశ్వరి, టిడిపి నాయకులు షేక్ జిలాని భాషా, కోవూరు వెంకీ, పంది శ్రీనివాసులు,షేక్ భాషి, నక్క రమణయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రక్తపోటు వ్యాధిపై అప్రమత్తంగా వుండాలి సిహెచ్‌సి సూపరిడెంట్ డాక్టర్ అర్షియా



**రాపూరు, మే 17, ప్రభాతవార్త :** రక్తపోటు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అర్షియా కోరారు. ఆదివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకోని సిహెచ సిలో డాక్టర్ హరిష్ రోగులకు ప్రత్యేకంగా రక్తపోటు పరిక్షలను నిర్వహించి, రక్తపోటు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్షియా మాట్లాడుతూ ఆధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్(నిశ్శబ్ధ హంతకుడు) అంటారని, ప్రపంచ వ్యాప్తంగా 170 కోట్ల పైగా ప్రజలు ఈ రక్తపోటుతో భాదపడుతున్నారన్నారు. సకాలంలో రక్తపోటును గుర్తించకపోతే గుండెపోటు ,పక్షవాతం, తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యం సంబవించే అవకాశం వుందన్నారు. రక్తపోటుకు ప్రధాన కారణాలుగా ఆధిక మానసిక ఒత్తిడి, సరిపడా నిద్ర లేకపోవడం, ఆహారంలో ఉప్పు(సోడియం) ఎక్కువగా తీసుకోవడం, ఊబకాయం(అధిక బరువు), శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు వున్నవారికి ఈ రక్తపోటు వచ్చే అవకాశం వుందన్నారు. రక్తపోటు నివారణకు క్రమం తప్పకుండా రక్తపోటు పరిక్షలను నిర్వహించుకోని రక్తపోటు సాధారణ స్థాయిలో వుండేలా చూసుకోవాలన్నారు. ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడంతో పాటు, పండ్లు, ఆకుకూరలు,తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని, ప్రతి రోజు కనీసం 30 నిమిషాల పాటు నడక, యోగా లేదా ఎదైనా శారీరక వ్యాయమం చేయాలన్నారు. శరీర బరువును ఆదుపులో వుంచుకోవడం ద్వారా రక్తపోటును నివారించుకునే అవకాశం వుందన్నారు. వైద్య పరిక్షలలో రక్తపోటు వున్నట్లు తెలితే వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుకోని రక్తపోటును ఆదుపులోకి వుంచుకోవాలని కోరారు.పలువురుకి రక్తపోటు పరిక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిహెచ్‌సి వైద్య సిబ్బంది వున్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**వింజమూరు, మే17, ప్రభాతవార్త :** వింజమూరులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సరికొత్త అనుభూతులకు ఆత్మీయ పలకరింపులకు వేదికైంది. నేతాజీ వికాస్ విద్యసంస్థల్లో 2001-2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి అలాగే 2002-2004 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. దాదాపు 20 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మిత్రులంతా ఒకే చోట చేరడంతో ఆ ప్రాంతమంతా ఆనంద అనురాగంతో వెల్లివిరిసింది. చిరున వ్వులు కరచాల నాలు ఆలింగనాలు ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి వింజమూరులో శ్రీ నేతాజీ వికాస్ సుమారు రెండు దశాబ్దాలు తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఒకరినొకరు చూసుకోగానే పాత జ్ఞాపకాలు గుర్తొచ్చి ఆనందంతో ఉప్పొంగి పోయారు. ఆత్మీయ కరచనాలు స్నేహపూర్వక ఆలింగనాలతో ఫంక్షన్ హాల్ అంతా కోలాహాలంగా మారింది. ఒకరికికొకరు కుశల ప్రశ్నలు అడుగుతూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపు కుంటూ ఆత్మీయ ఆనందాన్ని పంచుకున్నారు.నాడు తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నో ఏళ్లకు ఎదురుచూస్తున్న ఇలాంటి అద్భుతమైన రోజు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ అప్పుడప్పుడు ఇలాగే కలుసుకొని కష్టసుఖాలను పంచుకుంటూ స్నేహబంధాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా అందరూ ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక వేడుకల్లో నేతాజీ వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కేవీ రత్నం డైరక్టర్లు ఎల్సీ రమణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జూపల్లి వెంకటేశ్వర్లు, బాలాజీలను నాటి విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా మార్చిన ఉపాధ్యాయ బృందాన్ని పూర్వ విద్యార్థులు ఎంతగానో గౌరవంగా సత్కరించారు. తమ సమక్షంలో పాత విద్యార్థులంతా ఇంత ఉన్నత స్థానాలలో కలుసుకోవడం చూసి ఉపాధ్యాయులు యాజమాన్యం ఎంతో గర్వపడ్డారు. ఈ మధురమైన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు, అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కావలి గౌడ సంఘానికి తనవంతు సహకారం అందిస్తా



**కావలి, మే 17 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గంలో అత్యధిక గౌడ జనాభా ఉన్నందున రాజకీయంగా అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని నెల్లూరు జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరకాల సీనయ్యగౌడ్ తెలిపారు. నెల్లూరు జిల్లా గౌడ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక శ్రీనివాస కళ్యాణ మండలంలో కావలి డివిజన్ గౌడ సంఘం అద్యక్షులు పంది పెనుగొండయ్యగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని సభ్యులను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తిరకాల శీనయ్యగౌడ్ మాట్లాడుతూ విద్యార్థి సంఘం, యువజనసంఘం, మహిళా సంఘం, ఉద్యోగుల సంఘం, గీత కార్మికుల సంఘం, ప్రొపెషనల్ సంఘం వంటి అనువాద సంఘం కమిటీలను కూడా పూర్తి చేయాలని తదావరా గౌడ్ కులం ఆయా రంగాలలో సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హత కలిగిన వారి అందరిని అందలం ఎక్కించే దిశగా పనిచేదాదం అని పిలుపునిచ్చారు. రాబోవు రోజుల్లో గౌడ్‌లు రాజకీయ, అర్థికంగా సామాజికంగా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్య ఉద్యోగ ఉపాధి పారిశ్రామిక, వ్యాపార రగాలలో శిక్షణ ఇచ్చి ఆయా రంగాల్లో అభివృద్ధి కోసం పాటు పడుతున్నామని తెలిపారు. పదవ తరగతిలో 500పైన మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నాయకులు అన్నం దయాకర్ గౌడ్, ఎపురు రమేష్‌గౌడ్,దద్దోలు చక్రపాణిగౌడ్, తుళ్లూరు మల్లికార్జునగౌడ్, ముక్కు రాధాక్రిష్ణగౌడ్, జడపల్లి రాజారావుగౌడ్, తిరకాల మోహన్‌బాబుగౌడ్, దద్దోలు పవన్‌తేజ్‌గౌడ్, మారుబోయిన మదుగౌడ్, తాత హేమంత్, పవన్‌కముఆర్, కావలి పట్టణ అధ్యక్షులు తుళ్లూరు శ్రీనివాసులుగౌడ్, ఎంఎస్‌గౌడ్, తీరుగా బత్తిన సురేష్‌గౌడ్, భరత్‌గౌడ్,జంపాని వంశీగౌడ్, తుళ్లూరు వెంకట రమణ య్య గౌడ్,ఉప్పాల శ్రీను ,నాసిన ప్రపసాద్, కోసూరి వెంకటేశ్వర్లుగౌడ్, తదితర గౌడ నాయకులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS
FOR SALE
★ East Facing Plot of 22 Ankanams for Sale in Gundlapalem Dhanalakshipuram Nellore. Price Rs 70 Lacs. Contact 8056011634.
(Ro.No.6683)
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



**గూడూరు, మే 17, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో నిర్మించిన కూరగాయల మార్కెట్‌షాపుల సముదాయాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ టెంకాయ కొట్టి పూజలు నిర్వహించి ప్రారంభించారు. మార్కెట్ వ్యాపారస్తులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. లాటరీ పద్ధతి ద్వారా వ్యాపా రస్తులకు షాపులను కేటాయించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వంలో నూతన కూరగాయల మార్కెట్‌ను అస్తవ్యస్తంగా నిర్మించి నిరుపయోగంగా వదిలేశారని తెలిపారు. మార్కెట్లో పూర్తిస్థాయిలో మాలిక వసతులు ఏర్పాటు చేసి నేడు ప్రారంభించడం జరిగిందని గతంలో ఉన్న వ్యాపారస్తులకే షాపులు లక్కీ డిప్ ద్వారా కేటాయించడం జరిగిందని వెల్లడించారు. పంచాయతీ రాజ్, 15 ఫైనాన్స్ నిధులు వచ్చాయని దీని ద్వారా పట్టణంలో రోడ్లు డ్రైనేజీ కాలువలు త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు పెట్రోల్ వాడకంతగ్గించేందుకు పట్టణంలో జరిగే కార్యక్రమాలకు సైకిల్‌పైనే వస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయకులు కిరణ్ కుమార్, మట్టం శ్రావణిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెంచురామయ్య, అబ్దుల్ రహీం, శ్రీనివాసులు రెడ్డి, లీలావతి, భారతి, కల్పన, ప్రణీత్ యాదవ్, ఓం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నుంచే పని.. సిద్ధమవ్వాలి మరి !

**వర్క్ ఫ్రం హోమ్‌కు కేంద్ర ప్రభుత్వం పిలుపు అమలైతే ఇంటిబాట పట్టనున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు**

**కోట,మే 17 ప్రభాతవార్త** ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్క్ ఫ్రం హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం బహుళజాతి సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోమ్ అన్ని ఐటి కంపెనీలు అమలు చేశాయి.సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సొంత గ్రామాలకు వచ్చి ఇంటి నుంచే పనిచేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా గడిపారు. కొవిడ్ ముప్పు పూర్తిగా తొలిగిపోవడంతో ప్రముఖ ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రం హోమ్‌ను ఎత్తి వేశాయి. జిల్లాకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ,ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారు. కొన్ని ఐటీ కంపెనీలు వారానికి ఒకటి, రెండ్రోజులే ఉద్యోగులు కార్యాలయాలకు వచ్చేలా చర్యలు తీసుకున్నాయి.పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో ఇప్పుడు వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగులను గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం కౌశలం సర్వే నిర్వహించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో పాటు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారికి నైపుణ్యాలు పెంచాలనే ఆలోచన చేసింది. సర్వేలో యువత ఇంటి నుంచి పనికి ఆసక్తి చూపించారని సమాచారం.వేలాది మంది ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ బాట పడితే కార్లు, ద్విచక్ర వాహనాలు ఇళ్ల వద్దే ఆగిపోయి ఇంధనం ఆదా అవుతుంది. అటుప్రైవేట్.. ఇటు ప్రభుత్వ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేయడంతో పాటు కొన్ని రోజుల పాటు ప్రజా రవాణాపై ఆధారపడితే ఏంతో మేలు జరిగే అవకాశముంది.

## మిత్రమా.. ఖర్చులు తగ్గించుకుందాం !

**కోట, మే 17 ప్రభాతవార్త** దేశ సేవలో పాలుపంచుకునేందుకు ఖజానాలతో పాటు కుటుంబ ఆదాయాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించాల్సిన తరుణమిది. ఇటీవల ప్రధాని మోదీ సైతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి పొదుపు, ఇంధనంపై చర్చించిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఏడాది వరకు బంగారం కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు. నెల్లూరు జిల్లాలోని పేద, మధ్యతరగతి కుటుంబాల వారి ఖర్చులు భిన్నంగా ఉన్నాయి. వారు చేసే చిన్న ఉద్యోగాల్లో జీతాలు తక్కువ, ఖర్చులు ఎక్కువ. వీరు సంపాదించిన ఆదాయంలో సింహభాగం విద్య,వైద్యానికే పెడుతున్నారు. తర్వాత వ్యవసాయం,ఇంటి, వ్యక్తిగత ఖర్చులు ఉన్నాయి. వీటితో పాటు విలాసాలకు అవసరంలేని ఎలక్ట్రికల్ సామగ్రి కొనుగోలు, విందు, వినోదాలకు వెచ్చిస్తున్నారు.

ఇలా చేద్దాం

- స్నేహితులతో కలిసి సినిమాలకు, పార్టీలకు వెళ్లడంతో ఓ వ్యక్తి సగటున రెండు వేల రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నాడు. వీటికి దూరంగా ఉంటే కుటుంబ ఖర్చులకు ఉపయోగపడతాయి.
- వివాహాలు, ఇతర ఫంక్షన్లలో ఆడపిల్లల తల్లిదండ్రులు బంగారాన్ని పెట్టడం ఆనవాయితీ. అలాగే అల్లుడు, బిడ్డకు బంగారం పెట్టే వారు ఎక్కువే. ఇలాంటి వాటికి స్వస్తి పలికితే మేలు.
- వంటనూనె వినియోగం తగ్గిస్తే ఆరోగ్యం, ఖర్చు ఆదా అవుతుంది. ప్రతి రోజు తక్కువ నూనెతో తయారు చేసే ఆహార పదార్థాలపై దృష్టి పెట్టాలి.
- ఖరీదైన చరవాణిలు, ఎలక్ట్రికల్ పరికరాలకు దూరంగా ఉండాలి.
- రైతులు అతిగా రసాయనిక వస్తువులను వినియోగిస్తే సారవంతమైన భూమిని కోల్పోతారు. ఖర్చులు పెరిగి పెట్టుబడి భారమవుతుంది. సేంద్రియ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తే మేలు.
- ఖరీదైన పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులు ఎలక్ట్రికల్ వాహనాలు కొనుగోలు చేస్తే నిర్వహణ భారం ఉండదు. పర్యావరణానికి మంచిదని నిపుణులు చెప్తున్నారు.

## మత్స్యకారులకు న్యాయం జరిగింది వైసిపి ప్రభుత్వంలోనే




**కావలి, మే 17 ప్రభాతవార్త :** మత్స్యు కారులకు న్యాయం జరిగింది. వైసిపి ప్రభుత్వ హాయాంలోనేనని నియోజకవర్గ మత్స్యకార నేతలు వైసిపి మండల అధ్య క్షులు వాయిల తిరుపతి, కోసూరి శ్రీను, కోడూరు రామచంద్రయ్య, గోవిందస్వా మి, వాయిల రామక్రిష్ణలు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకారులకు తీవ్రఅన్యాయం జరిగిందన్నారు. తీర ప్రాంతంలోని బోట్లు స్వాదీనం మాయ మయ్యాయని ఆ బోట్లును త్వరగా తెప్పించి నిందితులను శిక్షించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 19న కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామానికి మత్స్యకార భరోసా ఇవ్వడానికి రావడం జరుగుతుందని తెలిపారు. ఈ భరసాను వైసిపి ప్రభుత్వంలోనే అర్హులైన ప్రతి వారికి రూ.10వేలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తున్నారని తెలిపారు. అది కూడా ఎంతమందికి ఇస్తున్నారో తెలపాలన్నారు. వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికుమార్‌రెడ్డి మా ట్లాడుతూ మత్స్యకారులు పడుతున్న కష్టాలను తెలు సుకొని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జువ్వలదినలో షిఫింగ్‌హార్బర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలా ఎటుచూసినా వైసిపి ప్రభుత్వంలో మత్స్యకారులకు న్యాయం జరిగిందన్నారు. మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి షిపింగ్‌హార్బర్‌ను సందర్శనార్థం వచ్చినపుడు కూటమి ఎమ్మెల్యే దగుమాటి వెం కటక్రిష్ణారెడ్డి హర్బర్ వద్దకు ఎవకూ వెళ్ళరాదని అడ్డుకొన్నారని తెలిపారు. ఇప్పుడు సిఎం చంద్రబాబు వస్తుంటే ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని వేడుకోవడం ఎంత వరకు సబబు అన్నారు. ఇప్పటికి, ఎప్పటికి వైసిపి ప్రభుత్వమే మత్స్యకారులకు అండగా ఉంటున్నామన్నారు. కావలి నియోజకవర్గ మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

## మ్యాజిక్ షోతో శాస్త్రీయ దృక్పదం




**కోవూరు, మే17 ప్రభాతవార్త** : కోవూరులోని పచ్చిపాల శంకర్‌రెడ్డి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం మెజీషియన్ ఎం. కృష్ణారావు మ్యాజిక్ షోతో పిల్లలకు శాస్త్రీయ దృక్పదం కల్పించారు. ఈ సందర్భంగా నెల్లూరు మెడికల్ కళాశాల ప్రొ ఫెసర్ డాక్టర్ కాలేషా బాషా మాట్లాడుతూ ఈ వేసవిలో ఇటువంటి విజ్ఞాన శిబిరాలను చిన్నా రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలన్నారు. ముఖ్యంగా గ్రంథాలయంలో ఉ న్న మహనీయుల చరిత్రలు పూర్తిగా చదు వుకుని తమ మేదస్సును మరింత పదును పెట్టుకోవాలన్నారు. ఈసందర్భంగా కృష్ణారావు చేసిన మ్యాజిక్ షో చిన్నారులకు ఆకట్టుకుంది. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను, మెజీషియన్ కృష్ణారావు,లైబ్రేరియన్ జె. సురేంద్రరెడ్డిలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారెడ్డి, మునీంద్ర, బి. శ్రీనివాసులు, పుల్లయ్య, భాస్కర్, వెంకయ్య, తదితరులు ఉన్నారు.



## పార్టీ విస్తరణకు వైఎస్సార్సీపీ అడుగులు

**: గ్రామ కమిటీలను ప్రకటించిన ప్రసన్న కుమార్ రెడ్డి**



**విడవలూరు, మే 17, ప్రభాతవార్త :** మం దలంలోని ఊటుకూరు పెద్దపాలెం, అలగా నిపాడు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్ర సన్న కుమార్ రెడ్డి ప్రకటించారు. గ్రామస్థా యిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరి ష్కారమే లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేసనట్లు తెలిపారు. అలగానిపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గండవరపు వివేకానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా శీలు రవి,పరుసు మస్తానయ్య నియ మితులయ్యారు. కార్యదర్శులుగా చాట్ల సుబ్రహ్మణ్యం, నారు సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఊటుకూరు పెద్దపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొండూరు పోలిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బుచ్చంగారి పెద్ద నా గూర్, సున్నపు సమాధి ఎంపికయ్యారు. కార్యదర్శులుగా త్రిపురి కోటి సింహాద్రి, సున్నపు బాలయ్యలను నియమించారు నూతనంగా నియమితులైన అధ్యక్షులు, కార్యదర్శులు నెల్లూరులోని మాజీ మంత్రి ప్రసన్న కుమార్‌రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉం దాలని నూతన కమిటీ సభ్యులకు మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి సూచించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, కోవూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు అనపల్లి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా.. మా లైబ్రరీని తెరిపించండి"

**: గ్రామ ప్రజల ఆవేదనకు చైర్పర్సన్ మేకపాటి హామీ**



**విడవలూరు, మే 17 ప్రభాతవార్త:** మండలం వావిళ్ల గ్రామ గ్రం థాలయాన్ని నాలుగు నెలలుగా మూసివేయడంతో గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొం టు న్నారని ఆదివారం నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ మేకపాటి శాంతి కుమారి దృష్టికి తీసు కెళ్లారు. ఆదివారం వావిళ్ల గ్రామ గ్రంథాలయాన్ని సందర్శించిన ఆమెను గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు కలిసి గ్రంథాలయాన్ని వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. కనీసం పత్రికలు చదివేందుకు కూడా అవకాశం లేకపోయిందని, తమ గ్రామంలో లైబ్రరీ సెంటర్" పేరుతో ప్రసిద్ధి చెందిన ఈ గ్రంథాలయం ద్వారా ఎంతోమంది చదువుకొని ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గ్రామ గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, అధికారులు కూడా సహకరించి గ్రంథాలయాన్ని తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ మేకపాటి శాంతి కుమారి మాట్లాడుతూ గ్రామ ప్రజలు గ్రంథాలయంపై చూపిస్తున్న ప్రేమ, ఆసక్తి ఆనందంగా ఉందన్నారు. తప్పనిసరిగా నెల రోజుల్లో వావిళ్ల గ్రామ గ్రంథాలయాన్ని పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేరుకు పోయిన చెత్తతో
## కంపుకోడుతున్న రాపూరు పంచాయితీ



**..పంచాయితీ పరిధిలో ఎక్కడి చెత్త అక్కడే ..అడిగేవారు లేరు.. తొలగించే వారు లేరు ..ఇదేనా స్వర్ణాంధ్ర.. స్వచ్ఛంద్రా అంటున్న ప్రజలు**

**రాపూరు, మే 17, ప్రభాతవార్త** మం డల కేంద్రమైన రాపూరు పంచాయి తీ లో పారిశుద్ధ్యంరోజు,రోజుకు దిగ జారి పోతుంది. పట్టణంలోఎక్కడి చెత్త అ క్కడ పేరుకుపోయి ఆయా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారి ప్రజలకు ఇ బ్బందిగా మారడంతో పాటు వారిని ప లు రకాలైనరోగాల భారిన పడేలా చేస్తు న్నాయి. మేజర్ పంచాయితీ అ యిన రాపూరు పంచాయితీలో పారి శుధ్య సిబ్బంది కొరతతో అల్లాడి పోతుం ది. పంచాయితీ అధికారులు తగినంత మంది పారిశుధ్య సిబ్బందిని నియమించకపోవడంతో పట్టణంలోని పలు ప్రాంతాలలో చెత్త పెద్ద ఎత్తున పేరుకోని పోయి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. రాష్ట ప్రభు త్వం ప్రతి ష్టాత్మకంగా ప్రతి మూడవ శనివారం స్వర్ణంధ్రా..స్వచ్ఛంధ్రా అం టూ ర్యాలీలు నిర్వహించడంతో పాటు చెత్త లేకుండా వుండాలని చెపుతుంది. కాని రాపూరులో మాత్రం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛంధ్రా ర్యాలీలు జరుగుతున్నాయి కాని పారిశుధ్యం మాత్రం కానరావడం లేదు. ప్రభుత్వం పట్టణం పరిశుభ్రంగా వుంచడం కోసం మేజర్



పంచాయితీ అయిన రాపూరుకు సుమారు 20 చెత్తరిక్షాలను కేటాయించింది. అయితే వీటిని నిర్వహించాల్సిన పంచాయితీ అధికారులు వీటిని పట్టించుకోక పోవడంతో ఇవి వాడకుండానే పాత మండల ప్రజా పరిషత్ కార్యలయం ఆవరణలో తుప్పు పట్టిపోతున్నాయి. ప్రధానంగా పెద్ద పీర్ల చావిడి దగ్గర డ్రైనేజి కాలువ పూడిపోవడంతో ఇక్కడ చెత్త అంతా కాలువలో నిండి రోడ్డుపై నిరు ప్రవహిస్తూ ప్రజలకు రాకపోకలకు ఇబ్బం దిగా మారింది. రామాలయం సెంటర్, పాత బ జారు వీధి, కొత్తపేట సినిమా హాల్ సెంటర్ తదితర ప్రాంతాలలో ప్రధానంగా చెత్త పేరుకోని పోయి దుర్గంధం వెదజల్లుతుంది. పారిశు ధ్యం పై శ్రద్ధ చూపని పంచాయితీ అధికారులు తెల్ల వారే సరికల్లా ఇంటి పన్నులు కట్టాలంటూ పట్ట ణంలోని నివాసాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు. ఇంటి పన్ను వసూళ్ళపై పెట్టిన శ్రద్ధకాస్త అయిన పారిశుధ్యంపై చూపితే పంచా యితీలో చెత్త గుట్టలు శుభ్రమై తాయని ప్రజలు అంటున్నారు. పం చాయితీలో చెత్త పేరు కోని పోతు న్నప్పటికి దీనిపై పట్టణంలో అడిగే వారు లేరు..అడిగినా పంచాయితీ వారు తొలగించే పరిస్థితి లేదని పట్టణ ప్ర జలువాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పం చాయితీ అధికారులు రాపూరులోని అన్ని విధులలో ఒకసారి ఆ కస్మిక పర్యటననిర్వహిస్తే పంచాయితీలో పరిస్థితి ఎలావుందో తెలుస్తుందని ప్రజలు కోరుతున్నారు.



## 'ప్రత్యేక' త లేని పాలన



**కోట,మే 17 ప్రభాతవార్త** గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమై 40 రోజులు గడిచింది.ఇప్పటి వరకు తమకు కేటాయించిన గ్రామాలను తతూ మంత్రగానే అధికారులు సందర్శించారనే వివర్శలు వినవస్తున్నాయి.పంచాయతీ కార్యదర్శులు తెచ్చిన దస్త్రాలపై సంతకాలు చేయడం తప్ప ప్రత్యక్ష పరిశీలనకు వెళ్లడం లేదు. దీంతో గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పేరుకుపోతున్నాయి. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణ. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిట్టేడులో రోడ్డుపక్కనే చెత్త చెదారం అలాగే పడేసి ఉంది. ఇక చెందోడులో తాగు నీళ్ల సరఫరా అంతంత మాత్రగానే ఉంది. రోజు కోళాలు ద్వార మంచి నీళ్ల రావడం లేదని స్దానికులు ఆరోపిస్తున్నారు. సర్పంచుల పాలన ముగియడంతో గత నెల 3 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ఆరంభమైంది. తహసీల్దార్లు, ఎంపిడివోలు,డిప్యూటి ఎంపిడివోలు, ఆర్‌డబ్లుఎస్ ఇంజినీర్లు,ఎంఇఒలు ప్రభుత్వం ప్రత్యేక అధికారులగా నియమిచింది. ఒక్కక్కరికి రెండు నుంచి మూడు పంచాయతీలను కేటాయించారు.వీరు తమ సొంత శాఖ బాధ్యతలతో పాటు గ్రామ పంచాయతీలకు వెళ్లే వాటి బాగోగులు చూడాల్సి ఉంది. తాజాగా ప్రతి బుధవారం స్వచ్ఛ పథం పేరుతో ప్రధాన రహదారుల శుభ్రం చేయాలని ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల భాగస్వామ్యంతో దీనిని నిర్వర్తించాల్సి ఉండగా ఆధిశగా ఇక్కడ ప్రత్యేకాధికారులు పాల్గోనడం లేదు.

## అంతర్జాతీయ ఎయిడ్స్ క్రొవ్వొత్తుల దినం




**నెల్లూరు, మే 17, ప్రభాతవార్త-వైద్యం** ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారం ,HIVతో చనిపోయిన వారి జ్ఞాపకార్థం వారి ఆత్మ శాంతి కోసం ఇం టర్నేషనల్ ఎయిడ్స్ కాండిల్ లైట్‌రాలీ నిర్వహించడం అందరికి తెలిసిందే . ఈ సంవత్సరం కూడా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా లెప్రసి ,ఎయిడ్స్,టీబీ అధికారి Dr Sk ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో 17 తేదీ ఆది వారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ప్రభుత్వ బి.ఎడ్ కళాశాల నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యా లయం వరకు భారీ రాలీ మోన ప్రదర్శన జరిగింది .ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి Dr సుజాత ముఖ్య అతిధిగా విచ్చేసి ర్యాలీ ని ప్రారంభించి మాట్లాడుతూ HIV ని ప్రాథమిక దశలోనే గుర్తించి నట్లైతే మరణాల సంఖ్య తగ్గించ వచ్చని , అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు . జిల్లా లెప్రసి ,ఎయిడ్స్ టీబీ అధికారి Dr Sk ఖాదర్ వలీమాట్లాడుతూ జిల్లా లోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో ఉచితంగా HIV పరీక్షలు చేస్తారని,సమస్య ఉన్నవారికి ఉచితంగా మందులు ఇస్తారని వారి యొక్క వివరాలు చాలా గోప్యంగా ఉంటాయని ,HIV ఉన్నప్పటికీ సక్రమంగా మందులు వాడితే వారియొక్క జీవిత కాలం పెంచవ చ్చని కావున క్రమం తప్పకుండ మందులు వాడితే మరణాల సంఖ్య తగ్గించ వచ్చన్నారు . HIV వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బం ది,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ,స్వచ్చంద సంస్థలు, పీఎంపీ , RMP సభ్యులు పాల్గొని ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేసారు .

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కాకర్ల



**కలిగిరి, మే17, ప్రభాతవార్త** ;కొండాపురం మండలం గానుగపెంటకు చెందిన మృతుడు జడ రసూల్ మృత దేహానికి ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ ఆదివారం అంజలి ఘటించారు. మృతుడు రెండు రోజుల క్రితం బావిలో శవమై కనిపించడం దానిపై మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన, పోలీస్ కేసులు వేయడం జరిగింది. మృతుని పోస్టుమార్టం జరిగిన తరువాత ఆదివారం స్వగామానికి తీసుకురాగా విషయం తెలుసుకున్న



ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.మృతుని కుటుంబానికి తమ ప్రగాడ సానుభూతిని తెలియజేయడమే కాకుండా కుటుంబానికి అన్ని విదాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.అంతేగాక కేసు విషయంలో కూడా తగు న్యియం చేస్తానని మాటిచ్చారు. కుటుంబసభ్యులకు రు.50వేల రూపాయలుఅందజేశారు.ఈకార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పియన్ఆర్ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంబించిన నాయకులు



కలిగిరి, మే17, ప్రభాతవార్త ; మండల కేంద్రమైన కలిగిరి హైస్కూల్ గ్రౌండ్‌లోఆదివారం నుండి ప్రారంభమౌతున్న స్వర్గీయ పియన్ ఆర్ క్రికెట్ టోర్నమెంటును ఆదివారం కలిగిరి మండల నాయకుల ఆద్వర్యంలో ప్రారంభించారు.నాయకులు ,క్రికెట్ అభిమానుల కోలాహలం మద్యన ఘనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈసందర్బంగా నాయకులు మాట్లాడుతూ దివంగత నాయకులు కీర్తి శేషులు పొన్న నాగేశ్వరరావు పేరుతో ఈ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంబించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యువతను ఉత్సహంగానూ, ఉత్తేజపరిచేవిదంగా జరిగే ఈక్రికెట్ మ్యాచ్ యువత దారుడ్యానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అంతేగాక ఈక్రికెట్‌లోగెలుపొందిన 1,2,3,జట్లుకు ప్రైజ్‌మనీ ప్రకటించిన దాతలకు,క్రీడలను ప్రేరేపించ వారికీ నాకులు కృతజ్ఞతలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో కలిగిరి జడ్పీటీసీ సభ్యులుపాలూరి మాల్యాద్రిరెడ్డి,బిజ్జం క్రిష్టారెడ్డి, కాటం రవీంద్రారెడ్డి,మేడం నరిశింహారెడ్డి,సిహెచ్. సుబ్బారెడ్డి బండారు లక్ష్మీన్నారాయణ,బండారు మల్లికార్జున ,కొప్పోలు కొండల రావు,బండారు మదు,రాంబాబుతదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలి



**కోవూరు, మే17 ప్రభాతవార్త :** జాతీయ రహ దారిలో ప్రయాణించే ప్రతి ద్విచక్ర వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూ రులోని జాతీయ రహదారి సాయిబాబా గుడి సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు వాహనదారులను ఆపి హెల్మెట్ వాడకపోతే వచ్చే అనర్థాలను వారికి విశదీకరించారు. ఇటీ వల కాలంలో జరిగిన ద్విచక్ర వాహనాల రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది హెల్మెట్ లేని కారణంగానే మృతిచెందారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. ఈ సందర్భంగా పలు వాహ నాలకు జరిమానాలు కూడా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.